వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

విప్ ధిక్కరించిన వారిపై వేటు వేయండి

- రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, ఫిబ్రవరి 29: విప్‌ను ధిక్కరించిన వారిపై వేటు వేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. జడ్పీ సీఈవో, మున్సిపల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న గౌతమ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు 29 మందికి, పార్టీ సూచించిన అభ్యర్థికి ఓటు వేయాలని విప్ జారీ చేశామని రిటర్నింగ్ అధికారికి వివరించారు. ఎన్నిక సందర్భంగా రిటర్నింగ్ అధికారి కౌన్సిలర్లందరికీ విప్ విషయాన్ని తెలియజేశారన్నారు. విప్ ధిక్కరిస్తే కౌన్సిలర్ పదవి కోల్పోతారని కూడా హెచ్చరించారన్నారు. విప్ ధిక్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లందరిని తొలగించాలని, అనర్హత కలిగిన కౌన్సిలర్ల ద్వారా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను రద్దు చేయాలని రిటర్నింగ్ అధికారిని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సతీశ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు బద్దం లతా జగన్‌మోహన్‌రెడ్డి, వొద్ది శ్రీలతారామ్మోహన్‌రావు, కూసరి అనిల్, బాలే లతాశంకర్, బొడ్ల జగదీష్, పిట్ట ధర్మరాజు, ఆవారి శివకేసరి బాబు, జుంబర్తి రాజ్‌కుమార్, కూతురు రాజేశ్, కోలగాని ప్రేమలతాసత్యం, కప్పల శ్రీకాంత్, కూతురు పద్మ శేఖర్, కోరే గంగమల్లు, క్యాదాసు నవీన్, గుర్రం రాము, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు ఓల్లెం మల్లేశం, తదితరులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

నేర విచారణను వేగవంతం చేయాలి: ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 29: నేర విచారణను వేగవంతం చేసి నేరస్తులకు శిక్షపడేలా ప్రతి ఒక్క పోలీసు అధికారి విధులు నిర్వహించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటే పరిస్థితులకు అనుగుణంగా విచారణ చేపట్టొచ్చన్నారు. గంజాయి రవాణా, వినియోగం, సేవించే వారిపై చర్యలకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్ రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఎస్‌బీ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, రఫీక్‌ఖాన్, సీఐలు, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా శాంతిభద్రతల పరిరక్షణకు నేటి నుంచి మార్చి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

- గోవింద నామస్మరణలతో మార్మోగిన బీర్‌పూర్ గుట్టలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సారంగాపూర్: కొండపై నుంచి పల్లకీలో స్వామివారిని తీసుకొస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్: మోహన్‌రావుపేటలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోరుట్ల: కల్యాణం సందర్భంగా తాళిబొట్టును చూపిస్తున్న అర్చకుడు

సారంగాపూర్, ఫిబ్రవరి 29: భక్తుల గోవింద నామ స్మరణతో బీర్‌పూర్ గుట్టలు మార్మోగాయి. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరి ఘట్టం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం గుట్ట కింద అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా గుట్టపైన హోమ గుండంలో మహాపూర్ణహుతి నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో గుట్టపై నుంచి కిందికి తీసుకొచ్చారు. అనంతరం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. స్వామి వారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి, ఎంపీపీ మసర్తి రమేశ్, జడ్పీటీసీ పాత పద్మారమేశ్, ఉపాధ్యక్షుడు బల్మూరి లక్ష్మణ్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఆలయ చైర్మన్ సామ్రాట్ గౌడ్, ఈవో సంకటాల శ్రీనివాస్, నాయకులు, అధికారులు దర్శించుకుని పూజలు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి29: గుల్లపేటలో గురువారం లోకమాత పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని సన్మానించారు. కాగా గ్రామంలో ప్రసన్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మంగళారపు మహేశ్, పార్టీ మండలాధ్యక్షుడు బాల ముకుందం, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, రాజిరెడ్డి, గంగన్న, శ్రీపాల్ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మల్లాపూర్, ఫిబ్రవరి 29: మొగిలిపేటలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో హోమం, కుంకుమపూజలతో పాటు, స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. టీపీసీసీ డెలిగెట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు-చంద్రిక దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ ఎంపీటీసీ ఓస సత్తమ్మ, మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల రూరల్: గుల్లపేటలో పోచమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ అనంతరం ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

కనులపండువగా వెంకన్న కల్యాణం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29: మోహన్‌రావుపేట గ్రామ శివారులోని గుట్టపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకపూజలు, హోమం, కల్యాణం నిర్వహించారు. అనంతరం జాతరను ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు

కోరుట్ల, ఫిబ్రవరి 29: పట్టణంలోని సత్య అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం నాగేంద్ర సహిత మానసా దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పాలెపు రామకృష్ణశర్మ, నిర్వాహకులు గడ్డమీది రాజన్న ఆధ్వర్యంలో ఆలయంలో యంత్ర స్థాపన, స్వామివారి కల్యాణాన్ని జరిపించారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 29: బండలింగాపూర్‌లో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం గతస్థాపిత దేవతార్చన, అగ్ని ప్రతిష్ఠ, నిత్యహోమం, క్షీరాదివాసం, ద్వాదశ కలశ స్థాపన, ప్రతిష్ఠామూర్తుల హోమం, సుందరకాండ హోమం, సంపూర్ణ రామాయణం, జలాదివాసం, ఫలపుష్పాదివాసం, నిత్య బలిహరణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయ తదితర దేవతల వేషధారణలతో అలరించిన చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు. రామభక్త మండలి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవస్థానం క్యూలో భక్తులు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఫిబ్రవరి 29: ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువైంది. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించారు. అనంతరం ప్రధాన ఆలయమైన లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామివారికి పట్టెనామాలు, కోరమీసాలు సమర్పించుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 29: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. జాతీయ స్థాయిలో షార్ట్‌పుట్ పోటీలకు ఎంపికైన మెట్‌పల్లికి చెందిన గజెల్లి హన్సికను గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. హన్సిక జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదగడం అభినందనీయమన్నారు. కాగా మెట్‌పల్లి కోర్టులో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సిబ్బంది విశ్వాస్, భాస్కర్‌కు గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు పలికారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు అనేవి సహజమని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

కొడిమ్యాల/పెగడపల్లి/కథలాపూర్, ఫిబ్రవరి 29: కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్, పెగడపల్లి మండలం సుద్దపల్లి, కథలాపూర్‌లో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎవరినైనా అంటరానివారిగా చూస్తున్నారా..?, ఆలయాలకు రానివ్వడం లేదా..? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అంటరానితనం, బాల్య వివాహాల నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. రామకిష్టాపూర్‌లో నాయబ్ తహసీల్దార్ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ హర్షరాజు, ఎంపీటీసీ మల్లారెడ్డి, సుద్దపల్లిలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, కథలాపూర్‌లో తహసీల్దార్ ముంతాజిబొద్దిన్, ఎంఈవో ఆనందరావు, ఎంపీవో తౌఖిర్‌అహ్మద్, ఆర్ఐ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడిట్ బృందానికి సహకరించాలి: ఎంపీడీవో

కొడిమ్యాల, ఫిబ్రవరి 29: గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించే ఉపాధి హామీ పనులకు సంబంధించి అడిట్ బృందానికి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని ఎంపీడీవో స్వరూప పేర్కొన్నారు. మండలంలోని బండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి గానూ గ్రామాల్లో రూ.7,28,18,137 పనులకు సంబంధించి బృందం సభ్యులు అడిట్ నిర్వహించనునట్లు చెప్పారు. పనుల ప్రదేశాలను అడిట్ బృంద సభ్యులకు చూపించాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్పీ తిరుపతి, డీవీవో చిన్నయ్య, అబ్జర్వర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

మోటివేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా రాజమునేశ్వర్

మేడిపల్లి, పిబ్రవరి 29: తోంబర్‌రావుపేటకు చెందిన అడ్లగట్ట రాజమునేశ్వర్ మోటివేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా అర్హత సాధించాడు. రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్ త్రీ స్టార్ హోటల్లో జరిగిన ఆఫ్‌లైన్ శిక్షణలో అడ్లగట్ట రాజమునేశ్వర్ ప్రతిభ కనబరిచాడు. రిటైర్డ్ ప్రొఫెసర్ విశ్వనాథం, ఇంపాక్ట్ ప్రతినిధుల చేతుల మీదుగా అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నాడు. మోటివేషన్ స్పీకర్‌గా ఎదగడానికి అవకాశం కల్పించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధులకు అడ్లగట్ట రాజమునేశ్వర్ కృతజ్ఞతలు తెలిపాడు.

గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

మల్లాపూర్, ఫిబ్రవరి 29: మల్లాపూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముద్దం శరత్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బండి స్వామిగౌడ్ ఎన్నికయ్యారు. సభ్యులుగా గొట్టిపడ్డ నారాయణ, పెరుమాండ్ల అర్జున్, అల్లాల నర్సయ్య, సార రవికుమార్, పోతుగంటి అనంతస్వామి, గొట్టిపడ్డ సత్యనారాయణ, అలాల పరాందాం ఎన్నికయ్యారు. నియామక ఉత్తర్వులను అబ్కారీశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అసద్ గురువారం నూతన పాలకవర్గం సభ్యులకు అందజేశారు. ఈ పాలకవర్గం ఐదేళ్లు కొనసాగనున్నది.

నూతన అధికారులకు సన్మానం

వెల్గటూర్, ఫిబ్రవరి 29: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు జరిగాయి. వెల్గటూర్‌లో ఎంపీడీవోగా పని చేసిన ఆకుల సంజీవరావు బదిలీపై కరీంనగర్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో రవీందర్‌రెడ్డి వచ్చారు. ఎండపల్లి నూతన మండలంగా ఏర్పడినప్పటి నుంచి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మెండి ఉదయ్‌కుమార్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో రవికాంత్ విధుల్లో చేరారు. కాగా గురువారం ఎండపల్లి బీఆర్ఎస్ నాయకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సింహాచలం జగన్, ప్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ రియాజ్, నాయకులు గంగయ్య, రాజ్‌కుమార్, సతీశ్, భాస్కర్, శ్రీపతిరావు, అంజయ్య, తిరుపతి, మహేందర్, రమణయ్య, చిరంజీవి, వెంకటేశ్, కష్ణ ఉన్నారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం అమలు చేయాలి

కోరుట్ల, ఫిబ్రవరి 29: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు పేర్కొన్నారు. గురువారం ఏఐటీయూసీ అనుబంధ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని బీడీ యజమానుల సంఘం ప్రతినిధిలకు కార్మికులకు పెంచిన వేతన సవరణ సంబంధిత పత్రాలను అందజేశారు. 1994లో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం పెరిగిన కూలీ రేట్లను ఏప్రిల్ నుంచి అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఇక్కడ బీడీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, ముక్రం, గంగారెడ్డి, లక్ష్మణ్ ఉన్నారు.

పేదింటి ఆడపిల్లలకు వరం 'కల్యాణలక్ష్మి'

కథలాపూర్, ఫిబ్రవరి 29: పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి పథకం అని ఎంపీపీ జవ్వాజి రేవతి, జడ్పీటీసీ నాగం భూమయ్య పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 59 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజిబొద్దిన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు, ఎంపీటీసీలు హైమావతి, రమేశ్, నాయకులు హరిప్రసాద్, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ సర్వేను అడ్డుకున్న రైతులు

కోరుట్ల, ఫిబ్రవరి 29: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా వరకు నాలుగు వరుసల బైపాస్ రహదారి నిర్మాణానికి అధికారులు సర్వే చేపడుతున్నారు. కోరుట్ల మండలం ఎఖీన్‌పూర్, సంగెం, కోరుట్ల పట్టణ సరిహద్దుల గుండా ఈ రహదారి నిర్మించేందుకు సర్వే పనులు జరుగుతున్నాయి. గురువారం సంగెం రోడ్డులో అధికారులు సర్వే నిర్వహిస్తుండగా కోరుట్లకు చెందిన రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. రెండు పంటలు పండే విలువైన భూములను ఇవ్వబోమని తేల్చి చెప్పారు. గతంలో నిర్ణయించిన పాత అలైన్‌మెంట్ ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కోరుట్ల తహసీల్దార్ కిషన్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. ఇక్కడ రైతులు పసుల కృష్ణప్రసాద్, గంగాధర్, నరేందర్, రాంగోపాల్, చంటి, చంద్రబాబు, హరీశ్, శ్రీనివాస్ ఉన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం

జగిత్యాల/జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 29: రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామిళ్ల రాంబాబు హెచ్చరించారు. గురువారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాజేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్త భవన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడంతో పాటు కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

పసుపు @ 13,511

మెట్‌పల్లి, ఫిబ్రవరి 29: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయ, విక్రయాలు కొనసాగుతున్నాయి. గురువారం మార్కెట్‌లో పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.13,511, కనిష్ఠంగా రూ.4,326, పసుపు గోళ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,555, కనిష్ఠంగా రూ.6,600, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,351, కనిష్ఠంగా రూ. 7,111 ధర పలికింది. మార్కెట్‌లో ఇప్పటివరకు 6,050 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగింది.

ఒకేసారి రెండు ఉద్యోగాలు

- సత్తా చాటిన సత్తక్కపల్లి యువతి

కొత్తపల్లి పావని

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 29: ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు ఉద్యోగం రావడమే కష్టం.. అందునా ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే ఎంతో శ్రమించాలి. అయితే, ఓ యువతి ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ప్రతిభను చాటింది. వివరాల్లోకి వెళితే.. మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి(కొడిమ్యాల) పావని రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జూనియర్ లెక్చరర్ పోస్టు, తెలంగాణ గురుకుల ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పీజీటీ పరీక్షలు రాసింది. గురువారం జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయగా మ్యాథమెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 139 ర్యాంకు సాధించింది. అలాగే, పదిహేను రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో తెలంగాణ సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోని విద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) పోస్టుకు రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు సాధించి ఎంపికైంది. ఒకేసారి జూనియర్ లెక్చరర్, గురుకుల విద్యాలయాల్లో పీజీటీ పోస్టుకు ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచింది. కాగా, పావని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ(మ్యాథమెటిక్స్), బీఈడీ పూర్తి చేసింది. ఈ సందర్భంగా పావనిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

పంటల పరిశీలన

కోరుట్ల రూరల్/జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 29: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వేసిన పంటల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి పేర్కొన్నారు. ఈ మేరకు కోరుట్ల మండలంలోని మాదాపూర్, అయిలాపూర్‌లో ఎరువుల దుకాణాలను, పంటలను మండల వ్యవసాయాధికారి నాగమణితో కలిసి పరిశీలించారు. కాగా రాయికల్ మండలం అల్లీపూర్‌లోని మామిడి తోటలను పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రజినీదేవి, డాక్టర్ రవి, స్వాతి సందర్శించారు. అనంతరం నువ్వు విత్తనోత్పత్తి క్షేత్రాలను సందర్శించి రైతులకు తగు సూచనలు అందించారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత

కొడిమ్యాల, ఫిబ్రవరి 29: అప్పారావుపేట గ్రామ శివారులో డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ఇటీవల కొందరు లే అవుట్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టేందుకు గురువారం ముగ్గు పోయగా ఎంపీవో ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 29: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్బీఎల్డీవో సాయితేజారెడ్డి పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 26 నుంచి మార్చి1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా గురువారం తాటిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ చాణక్య, జిల్లా ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ మధుసూదన్, జిల్లా క్వాలిటి కో-ఆర్డినేటర్ రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

జగిత్యాల, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం 97.13 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7049 మందికి గానూ 6875 మంది పరీక్షలకు హాజరయ్యారని, 174 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. అరవింద్‌నగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

సమస్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి

కథలాపూర్/మేడిపల్లి,ఫిబ్రవరి 29: కథలాపూర్ మండలంలోని చింతకుంటకు అనుబంధమైన చిన్నగూడెంలోని సమస్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ప్రభుత్వ విప్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి సమస్య తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలను సరి చేయాలని, రాజారాం తండాలో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న వైర్లను సరి చేయాలని విన్నవించారు. చింతకుంట గ్రామశివారులో ఒన్నయ్య ఒర్రె వద్ద రోడ్డు కోతకు గురైందని, అక్కడ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా కథలాపూర్ మండలంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 1.33 కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు గురువారం తెలిపారు. కులసంఘాల భవనాలకు గానూ రూ.71 లక్షలు, గ్రామాల్లో నీటి సమస్య తీర్చడానికి బోరుబావుల ఏర్పాటుకు రూ.28 లక్షలు, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలకు గానూ రూ.34.50 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మేడిపల్లిలోని ముదిరాజ్ సంఘ భవనానికి రూ.4 లక్షలు, కొండాపూర్‌లోని ముదిరాజ్ సంఘ భవనానికి రూ.3 లక్షల 70 వేలు, విలాయతాబాద్‌లోని వడ్డెర సంఘ భవనానికి రూ.3 లక్షల నిధు